# పల్స్ పోలియో

"నమస్కారమండీ."

ఆ గొంతుక విని ఆవిడ వంక చూశాను. నలభై సంవత్సరాలు దాటిన వ్యక్తి కర్రల సహాయంతో నడుస్తోంది. ప్రక్కనే యిరవై సంవత్సరాల పిల్ల, ఆ పిల్ల పొత్తిళ్ళలో యింకొక పసిపిల్ల.

"పాపకు పోలియో చుక్కలు వేయిద్దామని తీసుకువచ్చాను."

"మీ మనుమరాలా?" అని అడిగాను.

ఆ ప్రశ్న అడగగానే ఆవిడ ముఖంలో సంతోషం కనిపించింది.

"పిల్లకు పోలియో చుక్కలు వేశాము."

ఆవిడ మళ్ళీ నాకు నమస్కారము పెట్టి బయలుదేరింది. 'ఈ వ్యక్తిని ఇదివరకు ఎప్పుడో చూశాను' అన్న ఆలోచన మనస్సులో మసలుతోంది. ధైర్యం చేసి అడిగాను.

"మీ పేరు ఝాన్సీగారు కదా."

ఆవిడ క్షణం తటపటాయించింది. ఔనన్నట్టుగా తలవూపింది.

"మీవారు కులాసాగా ఉన్నారా?"

"లేరు. పోయారు. ప్రమాదంలో మరణించారు."

"ఎప్పుడు?"

"పదిహేను సంవత్సరాల క్రితం..."

"ఈ అమ్మాయి...?"

"మా అమ్మాయి..."

నేనేం మాట్లాడలేదు. ఆవిడ నావంక చూసి తలవంచుకుని నెమ్మదిగా అన్నది.

"నన్ను క్షమించండి. మీకు చాలా యిబ్బంది కలిగించాను! ... నా యిబ్బందిని, కష్టాన్ని అర్థం చేసుకోండి. నన్ను క్షమించండి."

నేనేం సమాధానం చెప్పలేదు. మిగతా పిల్లలకి చుక్కలు వేయడం మొదలు పెట్టాను. ఆవిడ వెళ్ళిపోయింది.

"ఎవరు ఆవిడ?" అని నా ప్రక్కనున్న మా యిల్లాలు అడిగింది. "ఎంత అందమైన మనిషి? ఈ అంగవైకల్యం లేకపోతే రవివర్మ పెయింటింగ్ లాగా వుండేది."

సమాధానం చెప్పటానికి నాకు తీరిక లేకపోయింది. సమాధానం చెప్పాలని కూడా నాకు అనిపించలేదు.

గతజల సేతు బంధనం అనవసరం, అవివేకం అనిపించింది.

నా మనస్సులో ఉన్న ఆలోచన, ఆశయం ఒకటే. అందరు పిల్లలకు అంగవైకల్యం రాకుండా చేయాలి. దానికంటె యింకా ముఖ్యం- పెద్దలలో స్వార్థమనే మనో వైకల్యం లేకుండా చేయాలి! సాయంకాలం యింటికి చేరుకున్న తరువాత- మా యిల్లాలు ఆ ప్రశ్న మళ్ళీ వేసింది.

ఈసారి నాకు కోపం రాలేదు. భోజనం చేసి వెన్నెలలో కూర్చున్న తరువాత- నేనే చెప్పడం మొదలు పెట్టాను.

నేను నాలుగైదు సంవత్సరాలలో రిటైరు అవుతాననగా మా కంపెనీలు నన్ను ఎంప్లాయిమెంటు బోర్డు ఛైర్మన్‌గా నియమించారు.

అభ్యర్థి - ఆర్థిక స్థితి - అర్హత - అనుభవం - అవసరం - ఆరోగ్యం- మన సంస్థకు అతను చేయగలిగిన సేవ - వీటిని దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులని ఎన్నిక చేయడం జరిగేది.

అనారోగ్యవంతులు, అంగవైకల్యం ఇవి మాకు యిబ్బందికరమైనవి. అటువంటివారికి మా సంస్థలో అవకాశం ఉండేది కాదు.

కాని ఒకసారి గవర్నమెంటు దగ్గరనుంచి ఒక అభ్యర్థన వచ్చింది. అన్ని పద్ధతులలో కూడ పనిచేయగల సామర్థ్యం గల మూగవారికి - అవిటివారికి - మా సంస్థలో కూడా స్థానం కలిపించడానికి అవకాశాలు పరిశీలించవలసిందని -

సానుభూతితో పరిశీలించాము. ఇద్దరికి ఉద్యోగం యివ్వగలిగాము. స్ప్రే పెయింటులో వచ్చిన ఒక మూగవానికి, పి.బి.ఎక్స్. ఆపరేట్ చేయగల ఒక లేడీ రిసెప్షనిస్టు-కమ్-టెలిఫోన్ ఆపరేటర్‌కి.

వికలాంగుల కోటాలో ఎన్నిక కావడం వలన వాళ్ళకి కొన్ని ప్రత్యేకమైన సదుపాయాలు, అలవెన్సులు ఏర్పాటు చేశాము.

టెలిఫోన్ ఆపరేటరుగా ఝాన్సీ మా సంస్థలో చేరింది. నేను ఆ ఉద్యోగం యిచ్చాననే కృతజ్ఞతతో ఉండేది. నేను కనపడగానే లేచి నిలబడటానికి ప్రయత్నం చేసేది. నమస్కారం పెట్టేది.

చాలా సమర్థురాలుగా పేరు తెచ్చుకుంది.

మంచి జీతం- మంచి ఉద్యోగం- స్పెషల్ అలవెన్సులు- సదుపాయాలు- ఇవి చాలా మందికి ఆశ కలిగించాయి.

పది రోజులు శెలవు పెట్టింది. మట్టెలు, మంగళసూత్రాలతో తిరిగి వచ్చింది.

ఆఫీసులో ఎవరినీ పిలువ లేదు. కాని ఆ పిల్లకు వివాహం అయిందన్న విషయం చాలా సంతోషాన్ని కలిగించింది. ఎందుకు పిలువలేదని ఎవ్వరు అడగలేదు. ఒక మంచి కానుక యిచ్చారని తెలిసింది.

సంతోషం కలిగింది.

నేను పదవి వరమణ చెయ్యడానికి ముందు - సుమారు రెండు నెలలకి ముందు ఒక మహత్తరమైన కార్యక్రమం మన రాష్ట్రంలో జరిగింది. లయన్స్ అండ్ రోటరీ ఇంటర్నేషనల్ సంస్థలు సంయుక్తంగా పోలియో వికలాంగులకు ఆపరేషన్ చేసి వారికి అంగవైకల్యం పోగొట్టే కార్యక్రమం చేపట్టారు. ప్రపంచ విఖ్యాతి గాంచిన సర్జనులు యీ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. ఈ ఆపరేషన్లు ఉచితంగా చెయ్యడమే కాదు- ఆపరేషన్ అయ్యిం తరువాత పూర్తిగా కోలుకునే వరకూ వారిని స్పెషల్ క్యాంపులలో ఉంచి, వారికి సహాయం చేస్తారు. 'కాలిపర్స్'లు ఉచితంగా యిస్తారు. బలం పట్టేటందుకు మంచి మందులు, టానిక్కులు ఉచితంగా యిస్తారు.

నాకు ఝాన్సీ గుర్తుకు వచ్చింది.

రోటరీ లోను, లయన్స్‌లోను ఉన్న మన మిత్రులతో సంప్రదించాను. వాళ్ళు చాలా సంతోషించారు. డాక్టర్లు, స్పెషలిస్టులు ఝాన్సీని పరీక్ష చేశారు. విదేశాల నుంచి వచ్చిన డాక్టర్లకు చూపించారు.

ఇప్పుడు ఆపరేషన్ చేస్తే బాగు చెయ్యవచ్చునని, యీ ఆపరేషను విజయవంతమైతే ప్రపంచంలో ఎవ్వరూ యీ వైకల్యంతో బాధపడవలసిన అవసరం ఉండదని హామీ యిచ్చారు. మనదేశంలో యిటువంటి రకం ఆపరేషను యిది మొదటిది అవుతుందని, వికలాంగుల లిస్టులోంచి వారి పేరు తీసేయవచ్చునని, వాళ్ళు మిగతా మనుష్యులలాగా హాయిగా బ్రతకవచ్చునని నమ్మకంగా చెప్పారు. పరీక్షలు పూర్తి అయింతరువాత ఆపరేషన్లు హైదరాబాదు, మద్రాసు, బెంగుళూరు నగరాలలో చేస్తారని, రోగి వెంట వుండటానికి ఒక వ్యక్తిని అనుమతిస్తారని, వారికి సంబంధించిన ఖర్చులు, అన్ని సదుపాయాలు యీ స్వచ్ఛంధ సంస్థలే భరిస్తాయని చెప్పారు. నాకు చాలా సంతోషం కలిగింది. ఝాన్సీకి సెలవు యివ్వటానికి మా సంస్థ ఒప్పుకుంది. ఇంతవరకు అంతా సవ్యంగానే జరిగింది. ఆపరేషన్‌కు తనకు

ఎటువంటి అభ్యంతరం లేదని, ఆపరేషను ఒకవేళ విజయవంతం కాకపోతే ఎవరినీ నిందించమని, లీగల్ చర్యలు తీసుకోమని హామీ పత్రంపై గార్డియన్ లేదా భర్త లేదా తండ్రి సంతకం యీ ఫారమ్ మీద పెట్టించి తీసుకురావాలని ఒక ఫారమ్ యిచ్చారు. నాలుగు రోజులు టైము యిచ్చారు.

నాలుగవ రోజున ఝాన్సీ భర్త మా ఆఫీసుకు వచ్చాడు. ముచ్చటగా మూడు వాక్యాలు పలికాడు.

'అపరేషన్ చేయించడం నాకు యిష్టం లేదు.'

'నేను సంతకం చెయ్యను.'

'నా మాట కాదని మీరు ఆపరేషన్ చేయించటానికి ప్రయత్నం చేస్తే నేను పోలీసు రిపోర్టు యిస్తాను.'

సెక్యూరిటీ వాళ్ళు అతన్ని గౌరవంగానే గేటు బయటకు తీసుకువెళ్ళి వదిలారు.

ఝాన్సీ ఆపరేషను చేయించుకోలేదు.

వైద్యరంగంలో ఒక అద్భుతాన్ని నిరూపించుదామనుకున్న వైద్యులు యీ కార్యక్రమం విజయవంతం చేసి ఎనలేని కీర్తిని, గౌరవాన్ని పొందుదామని ఆశించిన లయన్స్ రోటరీ మిత్రులు చాల నిరాశ చెందారు. నామీద రవ్వంత కినుక వహించారు.

ఆ కార్యక్రమం దిగ్విజయంగా జరిగిందని వార్తాపత్రికల్లో చదివాను. రేడియోలో విన్నాను.

నేను ఆ కార్యక్రమంలో పాల్గొనలేకపోయాను.

కొద్ది రోజులకు నేను ఉద్యోగ విరమణ చేసాను. ఇక్కడికి వచ్చాను. తరువాత మా సంస్థని గురించి గాని, దాంట్లో వ్యక్తులని గురించి గాని మర్చిపోయాను.

సమాజసేవలో కాలం హాయిగా గడిచిపోతోంది. సుఖంగా ఉన్నాము.

ఝాన్సీని చూడగానే పీడకలలాగా జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది.

ఆ పిల్ల విషయంలో అపాత్రదానం చేసానేమోననిపించింది.

నాకు జరిగిన అవమానం గుర్తుకు వచ్చి రవ్వంత కోపం కలిగింది. బాధ వేసింది.

ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు? అదృష్టవంతుడిని చెడగొట్టలేరు. దురదృష్టవంతుడిని బాగుచెయ్యలేరు అన్న వేదాంతం మనస్సులో అనిపించింది. కుంటిగానే బతకమని దైవ నిర్ణయం కాబోలని సరిపెట్టుకున్నాను. కాని ఆపరేషను జరిగివుంటే

ఆవిడ జీవితంలో అద్భుతమైన మార్పు వచ్చివుండేది. తను కూడా ప్రమోషన్‌లు పొంది వుండేది."

మా యిల్లాలు శ్రద్ధగా విని ఒకటే మాట అన్నది. "ఇతరుల నేరాలకు, దురదృష్టాలకు మీరు బాధ్యులని, దాంట్లో మీ ప్రమేయం ఉందని అపోహ పడకండి. మీరు నిత్యం పారాయణ చేసే భగవద్గీతలో చెప్పిన విషయాలు ఆచరణలో పెట్టండి." ఆవిడ మాటలు నాకు అర్థమయ్యాయి. మనస్సుకు నచ్చాయి. ఆ రాత్రి అంతా హాయిగా నిద్రపోయాను. మరునాడు తేలికైన మనస్సుతో నిద్దర లేచాను.

"ఎవరికెవరు యీ లోకంలో
ఎవరికి ఎరుక
ఏ దారెటు పోతుందో
ఎవరిని అడుగక."

అన్న పాట టి.విలో వస్తోంది.

ఆలయాలలో దైవానికి సుప్రభాతం పలుకుతున్నారు.

లాన్లో కూర్చుని వార్తాపత్రికలు చదువుకుంటున్నాను.

ఝాన్సీని వెంటపెట్టుకుని మా యిల్లాలు వచ్చింది. బలవంతంగా ఆవిడని నా ఎదురుగా వున్న కుర్చీలో కూర్చోపెట్టింది. మంచి కాఫీ తీసుకువచ్చి యిచ్చింది. లోపలికి వెళుతూ నెమ్మదిగా, మెల్లగా నా చెవిలో ఒకమాట చెప్పింది.

"ఎప్పుడో జరిగినదానికి ఆవిడని యిప్పుడు కోప్పడకండి."

నేను నవ్వుతూ "అల్లాగేలే" అన్నాను.

"ఎల్లా వున్నావ్? ఏం చేస్తున్నావ్? పిల్లలెందరు?" అని ఝాన్సీని అడిగాను.

"అవిటిదాన్నిగానే వున్నాను. ఇక నన్నెవరూ బాగుచెయ్యలేరని డాక్టర్లు చెప్పారు. మీరు యిచ్చిన ఉద్యోగంలోనే వున్నాను. ఈరోజుకీ మీరు పెట్టిన అన్నమే తింటున్నాను. ఒక్కర్తే ఆడపిల్ల. నిన్న మీరు చూసిన అమ్మాయి. ఆనాడు మావారు చేసిన పనికి మీ పాదాలు పట్టుకుని క్షమార్పణ చెప్పుకుందామని యింతకాలంగా ప్రయత్నం చేస్తున్నాను. ఈనాటికి దైవానుగ్రహం వలన మిమ్మల్ని కలుసుకోగలిగాను. ఒక్క అయిదు నిముషాలు మీరు అవకాశం యిస్తే జరిగినది చెపుతాను."

"చెప్పండి. తొందరేమీలేదు."

"నేను పుట్టినప్పటినుంచి మా అమ్మగారు అనారోగ్యంతో బాధపడుతూ వుండేది. నా చిన్నప్పుడు నన్నెవరెవరో పరాయివాళ్ళు పెంచారు. బహుశః నాకు టీకాలు, పోలియో మందులు, బి.సి.జి. యిలాంటివేమీ వేసినట్లు లేదు. నాకు పోలియో వచ్చిన చాలా రోజులకు గాని ఆ విషయం నన్ను పెంచేవారికి తెలియలేదు. తెలిసిన తరువాత వాళ్ళు చెయ్యగలిగిందేమీ లేకపోయింది. దాని కర్మ అని ఊరుకున్నారు."

"నేను ఊరుకోలేదు. అందరి పిల్లలు లాగా నేనూ చదువుకుంటానని పట్టుపట్టాను. 'ఆ కుంటిదానికి పెళ్ళి ఎలాగూ కాదు. చదువుకుంటే దాని బ్రతుకు అది బ్రతుకుతుంది' అని వాళ్ళకు ఎవరో నచ్చచెప్పారు.

చదువు చెప్పించారు. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాను. నా స్నేహితురాళ్ళని చూసాను. వాళ్ళ జీవితాలు చూసాను. పెండ్లి, మొగుడు, పిల్లలు, నా సంసారం అనే ఆలోచనలు వచ్చాయి.

'కుంటి దాన్ని ఎవరు చేసుకుంటారు?' అని ప్రశ్న వేశారు.

'ఈ అమ్మాయి ఆస్తి నా పేరన పెడితే నేను చేసుకుంటాను' అంటూ ఈ వ్యక్తి ముందుకు వచ్చాడు. నేను సరేనన్నాను. మా పెళ్ళి అగ్నిసాక్షిగా జరగలేదు. రిజిస్ట్రారువారి ఆఫీసులో జరిగింది.

రెండు నెలలు గడిచాయి. ఆస్తి తన పేరుకు మార్చవలసిందని కాగితాలు వ్రాయించి తీసుకువచ్చారు. అతని ప్రవర్తన మీద నాకేదో అనుమానం ఉన్నా నేను సంతకాలు పెట్టాను.

ఆ క్షణం నుంచీ అతను యజమాని, నేను బానిస అయ్యాం.

రెండు నెలలు గడిచాయి. ఉద్యోగ ప్రయత్నం ప్రారంభించాను. ఈ ఉద్యోగం వస్తుందని అనుకోలేదు. కాని వచ్చింది. మంచి జీతం, పి.ఎఫ్., గ్రాట్యుటీ, పెన్షన్-

ఇవన్నీ విని అతను సంతోషించాడు. జీతం అంతా ప్రతి నెలా తనకే యివ్వాలని, నాకు కావలసిన డబ్బు తను యిస్తానని షరతు పెట్టాడు.

నేను తలవంచక తప్పలేదు. ఇంటి దగ్గర అన్నీ ఆంక్షలే. ఆఫీసులో ఉన్న సమయంలోనే ఆటవిడుపుగా వుండేది.

అతని సరదాలకు డబ్బు సంపాదించి యిచ్చే యంత్రాన్ని. జీవితాన్ని పంచుకున్న యిల్లాలిని కాదు అన్నట్టుగా ప్రవర్తించేవాడు.

ఎవరితోనో అతనికి సంబంధం వున్నదని చూచాయిగా విన్నాను. నిజమేనా అని అడిగాను.

'మగవాడిని నా యిష్టం. కుంటిమొహానివి. నోరు మూసుకుని ఒక మూల కూర్చో.'

నా మనస్సులో ఒక ఆలోచన వచ్చింది.

ఆయన నా మనస్సులో కనిపెట్టినట్టున్నాడు. కుంటిది కాబట్టి నోరు మూసుకుని పడివుంటోంది. ఆపరేషను చేసి కాలు బాగుపడితే మన మాట వినదు. దీని ఉద్యోగం వికలాంగులకు యిచ్చేది. వికలాంగురాలుగా వుంటే చాలా సదుపాయాలు వున్నాయి. బాగుపడి మామూలు మనిషి అయితే యీ వుద్యోగం వుంటుందా? యీ సదుపాయాలు వుంటాయా? ఈ రిజర్వేషనూ, యీ స్పెషల్ ట్రీట్‌మెంటూ వుంటుందా? వీల్లేదు. ఇది యిల్లా వుండవలసిందే. ఆపరేషన్ జరగటానికి వీల్లేదు.

అందుకనే యీ ఆగడం, యీ అల్లరి!

మా మధ్య ప్రేమలు లేకపోయినా, ఆత్మీయతలు, అంతఃకరణలూ లేకపోయినా, అతనికి మంచిగుణం లేకపోయినా మంచి రూపం వుంది. నాలో వయస్సుకు తగ్గ కోరికలు వున్నాయి. ఈ వివాహ బంధం తెంచుకోవాలని నేను తాపత్రయపడుతున్న సమయంలోనే నేను గర్భవతినయ్యాను. నేను తనని వదలి పారిపోననే ధైర్యం ఆయనకు వచ్చింది. బానిసగా చూడటం మానేశాడు. కాని మబ్బులేని పిడుగు పడ్డది.

పాపకు రెండు సంవత్సరాల వయస్సులో ఆయన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన ఆస్తి, డబ్బు ఆయన ప్రియురాలికి, ఆయన సంతానానికి దక్కాయి. తండ్రి లేని పాప, ఆపరేషన్ స్టేజి దాటిపోయిన నా అవిటితనం, మీరు యిచ్చిన ఉద్యోగం మిగిలాయి.

నా అదృష్టం కొద్దీ పాపకు నా అవిటితనం రాలేదు. బుద్ధిగా చదువుకుంది. బుద్ధిమంతుడిని పెళ్ళిచేసుకుంది. దాని కాపురం అది సుఖంగా చేసుకుంటోంది.

నాకు ఉద్యోగం యిచ్చి, నన్ను ఆదుకుని, నాకు అయాచితంగా సహాయం చేసి నా అంగవైకల్యాన్ని పోగొట్టటానికి ప్రయత్నం చేసిన మీకు నా వల్ల అవమానం జరిగింది. మిమ్మల్ని కలుసుకుని జరిగిన విషయం మీతో చెప్పి నన్ను క్షమించమని మిమ్మల్ని కోరాలని యింతకాలం తపించాను. దైవానుగ్రహం వల్ల అది యీనాటికి సాధ్యమయ్యింది. జరిగినదానికి నన్ను క్షమించమని, నామీద కోపం ఉంచుకోవద్దని ప్రార్థిస్తున్నాను."

నా మనస్సులో మబ్బులు తొలగిపోయాయి.

"నాకు మీమీద కోపం లేదు. దీంట్లో క్షమించడానికి ఏముంది? క్షేమంగా వెళ్ళిరండి. పాపకు రెండవ విడత పోలియో డ్రాప్స్ తప్పక వేయించండి. మరచి పోకండి" అన్నాను.

నమస్కారం పెట్టి ఆవిడ వెళ్ళిపోయింది.

ఇంకొక కప్పు కాఫీ తీసుకువస్తున్న నా యిల్లాలు కంటితోనే ప్రశ్నించింది- 'ఏం జరిగిందని?'

నేను భగవద్గీతలో శ్లోకం బిగ్గరగా చదివాను.

"నష్టో మోహః స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదాన్ మయా అచ్యుత
స్థితో అస్మి గత సందేహః కరిష్యే వచనం తవ"

సంతోషంతో- మిల మిలా, మెరిసే కన్నులతో యిల్లాలు "శుభమ్" అని అన్నది.